
# రాజన్న దీవెనతో సేవచేస్తా

- నేను ఈ ప్రాంత బిడ్డనే..
- వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే
- గ్యారెంటీ లేని పార్టీలను నమ్మవద్దు
- బీఆర్‌ఎస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు



చెక్కపల్లిలో బీజేపీ కార్యకర్తలకు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ రూరల్, అక్టోబర్ 12: వేములవాడ రాజన్న దీవెనలు, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో ఈ ప్రాంత ప్రజలకు సేవ చేస్తానని వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో గురువారం వేములవాడ రూరల్ బీఆర్‌ఎస్ నాయకుల సమావేశాన్ని మండలాధ్యక్షుడు గోస్కుల రవి ఆధ్వర్యంలో నిర్వహించగా, చల్మెడ, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, నేను ఈ ప్రాంత బిడ్డనేనని.. పక్కా లోకల్ అని స్పష్టం చేశారు. తనను విమర్శించేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. సీఎం కేసీఆర్‌కు తెలంగాణపై పూర్తి పట్టు ఉన్నదని, మరోసారి ఆయనను ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. 60 ఏండ్లలో జరుగని అభివృద్ధిని కేవలం తొమ్మిదిన్నర ఏండ్లలోనే కేసీఆర్ చేసి చూపించార ని కొనియాడారు. మిగిలిపోయిన పనులను రాబోయే మూడేండ్లల్లో పూర్తి చేస్తామన్నారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ అరుణ మాట్లాడుతూ, వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష అని స్పష్టం చేశారు. మూడోసారి సీఎం కేసీఆర్, ఎమ్మెల్యేగా చల్మెడ లక్ష్మీనరసింహారావుకు భారీ మెజార్టీ అందించాలని కోరారు.



చెక్కపల్లిలో నిర్వహించిన సమావేశానికి హాజరైన కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు

### కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానం

వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట, అచ్చన్నపల్లి గ్రామాల నుంచి దాదాపు 150మంది బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా, చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ వారికి గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఆయా కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశం, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, సెస్ డైరెక్టర్ దేవరాజు, సర్పంచులఫోరం మండలాధ్యక్షుడు ఏశ తిరుపతి, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ కట్కం మల్లేశం, ఏఎంసీ వైస్ చైర్మన్ వెల్మ బాల్‌రెడ్డి, సర్పంచ్ అడ్డిక జైపాల్ రెడ్డి, ఎంపీటీసీ వెల్మ నర్సవ్వ, సర్పంచులు పెండ్యాల తిరుపతి, పండుగ తిరుపతి, ఎంపీటీసీ మాల్లారం తిరుపతి, నాయకులు గడ్డం హన్మాండ్లు, సురేశ్, బాలు, అంజనీకుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- పరామర్శించిన చల్మెడ లక్ష్మీనరసింహారావు



స్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

వేములవాడ రూరల్, అక్టోబర్ 12: వేములవాడ పట్టణ శివారులోని కోనాయపల్లిరోడ్డులో బుడగజంగాల కాలనీకి చెందిన ఏల్ల స్వామి (24) ఇంట్లో విద్యుదాఘాతంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. స్వామి మృతి విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట కౌన్సిలర్ యాచమనేని శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

## విజ్ఞాన యాత్రకు ఆవునూరు పాఠశాల విద్యార్థులు



బాసర ట్రిపుల్ ఐటీలో ఆవునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు

ముస్తాబాద్, అక్టోబర్ 12: మండలంలోని ఆవునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు బాసర జ్ఞాన సరస్వతీ ఆలయాన్ని సందర్శించారు. గురువారం బాసర గోదావరి నదితో పాటు సరస్వతీ ఆలయాన్ని దర్శించుకుని ట్రిపుల్ ఐటీ కళాశాలకు చేరుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాలనే స్ఫూర్తిని కల్పించడానికి ఉపాధ్యాయులు ట్రిపుల్ ఐటీని సందర్శింపజేశారు. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు ఉన్నారు.

## జాతీయ ప్రతిభ ఉపకార వేతనానికి సానియా బేగం ఎంపిక

వేములవాడ రూరల్, అక్టోబర్ 12: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన సానియా బేగం కేంద్ర జాతీయ ప్రతిభ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. మార్చి 2023లో జరిగిన ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సానియాబేగంకు కేంద్ర విద్యాశాఖ ప్రతీ సంవత్సరం అందించే జాతీయ ప్రతిభ ఉపకార వేతనాన్ని అందజేస్తారన్నారు. ఎంపికైన సానియాబేగంను అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## రాజన్న ఆలయంలో ఘనంగా మహాలింగార్చన



అద్దాల మండపంలో లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, అక్టోబర్ 12: మాస శివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయంలో స్వామివారికి గురువారం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం 11 మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. రాజన్న ఆలయ అద్దాల మండపంలో రాత్రి 366 లింగాలు, 366 జ్యోతులను లింగాకారంగా వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## 128 మంది బైండోవర్

ఇల్లందకుంట/ వీణవంక, అక్టోబర్ 12: మండలానికి చెందిన పాత నేరస్తులు 20 మంది, బెల్టు షాపుల నిర్వాహకులు 50 మంది, రౌడీషీటర్లు 11 మందిని తహసీల్దార్ రాణి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచామని చెప్పారు. అలాగే వీణవంక మండలానికి చెందిన 48 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ ఆసిఫ్ తెలిపారు.

## చల్మెడ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి

- యువజన విభాగం మండలాధ్యక్షుడు జీవన్‌గౌడ్

కోనరావుపేట, అక్టోబర్ 12: వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు గెలుపుకోసం యువకులు సైనికుల్లా పని చేయాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు ముష్కం జీవన్‌గౌడ్ పిలుపునిచ్చారు. బావుసాయిపేటలో యువకులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల వారీగా యువకులు ప్రతి నిత్యం ప్రజల కోసం బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ ఫలాల గురించి వివరించాలన్నారు. ప్రజలందరినీ ఏక తాటిపైకి తీసుకొచ్చి చల్మెడను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడ బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు గంగసాని రమణారెడ్డి, బీఆర్‌ఎస్వీ మండలాధ్యక్షుడు చీటినేని శివతేజరావు, యువ నేతలు కోరెపు చంద్రకాంత్, మద్దూరి శ్రీపాల్‌రెడ్డి, యువజన విభాగం గ్రామ అధ్యక్షుడు బొల్లు రాకేశ్, తిక్కల బాబు, ఉపాధ్యక్షుడు షాదుల్లా, చక్రాల వేణు, యూసఫ్ పాల్గొన్నారు.



బావుసాయిపేటలో యువకులతో కలిసి మాట్లాడుతున్న యువజన విభాగం మండలాధ్యక్షుడు జీవన్‌గౌడ్

## పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలి: జడ్పీటీసీ

శంకరపట్నం, అక్టోబర్ 12: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ తిరిగి ఓటర్లకు వివరించాలని జడ్పీటీసీ లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని లింగాపూర్, కొత్తగట్టు, మెట్‌పల్లి, మొలంగూర్, చింతలపల్లి, రాజాపూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ బూత్ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా హాజరైన జడ్పీటీసీ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయానికి ప్రణాళిక‌ను రూపొందించుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి కుటుంబం బీఆర్‌ఎస్‌కే ఓటు వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి ప్రతి కార్యకర్తా చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పులికోట రమేశ్, సర్పంచుల ఫోరం చైర్మన్ పల్లె సంజీవరెడ్డి, సర్పంచ్ కిషన్‌రావు, ఆర్‌బీఎస్ జిల్లా సభ్యుడు అంతం కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఉమ్మెంతల సతీశ్‌రెడ్డి, భూమ సంపత్, మేడుదుల ఐలయ్య, శ్యాంరావు, వంగల కిషన్‌రెడ్డి, కుమార్ యాదవ్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు దుస్తుల అందజేత

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 12: తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో 6,7 తరగతులు చదువుతున్న రేగుల గౌతమ్, రేగుల వంశీకి సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు అయన్నగారి హరికృష్ణారెడ్డి దుస్తులను అందజేశారు. గౌతం, వంశీల తండ్రి రాజమల్లు గతంలో, తల్లి జ్యోతి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. తల్లిదండ్రులను కోల్పోయిన వారికి దసరా పండుగను పురస్కరించుకుని దుస్తులు అందజేశారు.

## ఎస్‌ఐ స్నేహితుల ఔదార్యం

చందుర్తి, అక్టోబర్ 12: అచేతన స్థితిలో ఉన్న మహిళకు ఎస్‌ఐ స్నేహితులు ఆపన్నహస్తం అందించారు. చందుర్తి మండలంలోని రామన్నపేటకు చెందిన వివాహిత ఉప్పెర నీరజ కొంతకాలంగా అనారోగ్యంతో మంచం పట్టింది. వైద్యానికి చేతిలో చిల్లిగవ్వలేక సాయం కోసం నిరీక్షిస్తోంది. ఈ క్రమంలో సోషల్ మీడియాలో స్థానిక సర్పంచ్ దమ్మ ఆనంద్ ప్రచారం చేయగా ఇప్పటికే పలువురు చేయూతనందించారు. కాగా గురువారం చందుర్తి ఎస్‌ఐ సిరిసిల్ల అశోక్ స్నేహితులు రూ.7వేల నగదును అందజేశారు.

## ట్రాక్టర్, బైక్ ఢీ.. ఒకరికి గాయాలు

ముస్తాబాద్, అక్టోబర్ 12: ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఆవునూరులో గురువారం జరిగింది. ఎస్‌ఐ శేఖర్ రెడ్డి వివరాల ప్రకారం... ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామానికి చెందిన పాతూరి రామ్‌రెడ్డి గ్రామంలో బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో తుర్కపల్లి నుంచి ముస్తాబాద్ వైపు వెళ్లే ఇసుక ట్రాక్టర్ అతడిని ఢీ కొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. రామ్‌రెడ్డిని వెంటనే సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించగా మెరుగైన వైద్యం కోసం వైద్యులు హైదరాబాద్‌కు సిఫారసు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.